# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | బుధవారం - 5- ఆగస్టు 2026 | సంపుటి : 4 | సంచిక : 62 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in


# వరంగల్‌లో అతిపెద్ద క్యాన్సర్ హాస్పిటల్

- రెండో అతిపెద్ద ప్రభుత్వ క్యాన్సర్ హాస్పిటల్ ఏర్పాటు
- ఏడాది చివరికి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం
- ఉత్తర తెలంగాణకు వైద్య సేవల కేంద్రంగా వరంగల్
- వైద్య సేవలపై మంత్రుల సమీక్ష సమావేశం





**హైదరాబాద్, ఆగస్టు 4 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో రెండో అతిపెద్ద ప్రభుత్వ క్యాన్సర్ హాస్పిటల్ని వరంగల్‌లో ఏర్పాటు చేయనున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ ప్రకటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక క్యాన్సర్ వైద్య సేవలు అందించేందుకు వరంగల్ ప్రాంతీయ క్యాన్సర్ హాస్పిటల్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ని ఈ ఏడాది చివరికల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో మంత్రి కొండా సురేఖతో కలిసి వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో ప్రభుత్వ వైద్య సేవలపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, జనరల్ ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఎమ్మెల్యేలు సూచించిన సమస్యలను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఎంజీఎం హాస్పిటల్లో ప్రస్తుతం 29 ప్రత్యేక విభాగాల్లో వైద్య సేవలు అందుతున్నాయని, త్వరలో మరో తొమ్మిది సూపర్ స్పెషాలిటీ సేవలను ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ని ఉత్తర తెలంగాణ ప్రజలకు అన్నిరకాల వైద్య సేవలు అందించే ప్రధాన వైద్య కేంద్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

మిగతా 2లో



# వర్షాలతో నగరానికి భారీ ఊరట

- హైదరాబాద్‌లో వర్షపాత లోటు 18 శాతానికి తగ్గుదల
- కొన్ని ప్రాంతాల్లో ఇంకా సాధారణం కంటే తక్కువ వర్షా లు
- ఆగస్టు 10 వరకు ఎల్లో అలర్ట్ జారీ
- భారీ వర్షా లు, పిడుగులపై వాతావరణ శాఖ హెచ్చరిక

**హైదరాబాద్, ఆగస్టు 4 (తెలంగాణ ముచ్చట్లు):**

గత వారం రోజులుగా కురుస్తున్న విస్తారమైన వర్షాలతో హైదరాబాద్ నగరంలో వర్షపాత లోటు గణనీయంగా తగ్గింది. వారం క్రితం 34 శాతంగా ఉన్న లోటు ప్రస్తుతం 18 శాతానికి చేరిందని తెలంగాణ రాష్ట్ర

మిగతా 2లో

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

- నూతన భవనాలను ప్రారంభించిన మంత్రి సీతక్క
- కష్టపడి చదివి రాష్ట్రంలో తొలి స్థానంలో నిలవాలని పిలుపు
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యపై దృష్టి
- రామప్ప ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి



**ములుగు, ఆగస్టు 4 (తెలంగాణ ముచ్చట్లు):**

విద్యార్థులు ఇష్టంతో, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, పోటీ ప్రపంచంలో ప్రతిభ చాటాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు.

మిగతా 2లో




# ఉపాధికి ఏటీసీ లే వేదిక

- రుద్రంగిలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌కు శంకుస్థాపన
- నైపుణ్య శిక్షణ నుంచి విదేశీ ఉద్యోగాల వరకు ప్రభుత్వ అండ
- జర్మనీ, జపాన్‌లో నెలకు రూ.2 లక్షలకు పైగా వేతనాల అవకాశాలు
- తెలంగాణ యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ

**రుద్రంగి, ఆగస్టు 4 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ యువతకు ఆధునిక నైపుణ్యాలు అందించి దేశీయ, విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తోందని

మిగతా 2లో

# లోక్‌సభలో వరంగల్ అభివృద్ధి ప్రస్తావన

- వరంగల్ ఎంపీ కడియం కావ్య కేంద్రాన్ని నిలదీత
- పీఎం గతిశక్తి, ఆస్పిరేషనల్ బ్లాక్స్ పథకాలపై వివరాలు కోరిన ఎంపీ
- వరంగల్ జిల్లాకు ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక ఉందా అని ప్రశ్న
- మంజూరైన ప్రాజెక్టుల వివరాలు వెల్లడించాలని కేంద్రానికి విజ్ఞప్తి

2లో



# సెప్టెంబర్ 1 నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు టీ–ఫైబర్

- ప్రైవేటు ఇంటర్నెట్ సేవలకు బిల్లులు చెల్లించొద్దని మంత్రి ఆదేశం
- టీ–స్వాన్‌ను నెల రోజుల్లో టీ–ఫైబర్‌కు అనుసంధానం చేయాలని సూచన
- ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక డిజిటల్ మౌలిక వసతుల కల్పనపై దృష్టి
- 'ప్రతి ఇంటికి ఇంటర్నెట్' కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశం



**హైదరాబాద్, ఆగస్టు 4 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. తెలంగాణ సచివాలయంలో మంగళవారం టీ-ఫైబర్ పురోగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సమాచార సాంకేతిక శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీ-ఫైబర్ మేనేజింగ్ డైరెక్టర్ వేణు ప్రసాద్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మిగతా 2లో

బుధవారం - 5- ఆగస్టు 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వరంగల్‌లో అతిపెద్ద క్యాన్సర్ హాస్పిటల్

(మొదటి పేజీ తరువాయి)



నిమ్స్ తరహాలో వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్కి ఎల్‌వోసీలు మంజూరు చేసి, అత్యాధునిక వైద్య పరికరాలు, అవసరమైన నిపుణులైన వైద్యులు, సిబ్బందిని నియమించి పూర్తి స్థాయిలో సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. జనగామ, నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలలను కూడా మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు.
హనుమకొండలో ఐవీఎఫ్ కేంద్రంతో పాటు ఔషధ, ఆహార పరీక్షల ప్రయోగశాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రాంతీయ నేత్ర హాస్పిటల్లో అత్యాధునిక కంటి వైద్య సేవలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. పరకాల, వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్, బచ్చన్నపేట, పాలకుర్తి, కమలాపూర్ ప్రాంతాలకు ఇప్పటికే మంజూరైన డయాలసిస్ కేంద్రాలను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మానవ వనరులు, మౌలిక సదుపాయాలు, అత్యాధునిక వైద్య పరికరాలు, ఔషధాలు, నిర్ధారణ సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లా స్థాయిలోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్, గాంధీ, ఉస్మానియా వంటి ప్రధాన ఆస్పత్రులపై రోగుల ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



# వర్షాలతో నగరానికి భారీ ఊరట

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీజీడీపీఎస్) వెల్లడించింది. ఈ రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు సాధారణంగా 297.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, 245 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపింది. నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఒకే స్థాయిలో వర్షాలు కురవలేదని గణాంకాలు సూచిస్తున్నాయి. తిరుమలగిరిలో 45 శాతం, సైదాబాద్‌లో 35 శాతం, మారేడ్‌పల్లిలో 31 శాతం, అంబర్‌పేటలో 27 శాతం, నాంపల్లి, చార్మినార్ ప్రాంతాల్లో 26 శాతం చొప్పున వర్షపాత లోటు కొనసాగుతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదుకావడానికి ఇంకా మరిన్ని వర్షాలు అవసరమని అధికారులు పేర్కొన్నారు.
మరోవైపు గోల్కొండలో సాధారణం కంటే 19 శాతం అధిక వర్షపాతం నమోదైంది. బహదూర్‌పురాలో 5 శాతం ఎక్కువ వర్షాలు కురవగా, షేక్‌పేట, అమీర్‌పేట, ముషీరాబాద్, ఆసిఫ్‌నగర్ ప్రాంతాల్లో వర్షపాతం సాధారణ స్థాయికి చేరువలో ఉందని టీజీడీపీఎస్ వెల్లడించింది. ఇటీవల కురిసిన వర్షాలు నగరంలోని జలాశయాలు, భూగర్భ జలాలపై సానుకూల ప్రభావం చూపుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రానున్న ఏడు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముండటంతో ఆగస్టు 10 వరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.
వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉండటంతో బహిరంగ ప్రదేశాల్లో అవసరం లేకుండా సంచరించవద్దని వాతావరణ శాఖ హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. రైతులు, ప్రయాణికులు తాజా వాతావరణ హెచ్చరికలను గమనించాలని సూచించింది. రానున్న రోజుల్లో వర్షాలు కొనసాగితే నగరంలో వర్షపాత లోటు మరింత తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా తగ్గుముఖం పట్టే అవకాశముందని, వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రజలకు అవసరమైన హెచ్చరికలు జారీ చేస్తామని ఐఎండీ వెల్లడించింది.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

(మొదటి పేజీ తరువాయి)



మంగళవారం వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ గ్రామంలో సమగ్ర శిక్ష పథకం కింద రూ.2.30 కోట్ల వ్యయంతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నూతన భవనం, అదనపు తరగతి గదులు, ప్రయోగశాల భవనాలను జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి కంప్యూటర్ విద్యపై అవగాహన ఎంతో అవసరమని అన్నారు. పట్టుదలతో చదివితే సాధించలేనిది ఏదీ లేదని పేర్కొన్నారు. గొప్ప విద్యను అభ్యసించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని, విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, ధ్యానం కూడా జీవితంలో ముఖ్యమని సూచించారు.
ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రైవేటు విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు మంత్రి సూచించారు. ఆధునిక బోధనా పద్ధతులను అనుసరించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. రానున్న పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలోనే ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, పాఠశాలల్లో విద్యాబోధన, మధ్యాహ్న భోజన నాణ్యతను పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు వెల్లడించారు.
మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతున్నారని, విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి సీతక్క పాలంపేటలోని రామప్ప ఆలయం వద్ద ప్రసాద్ పథకం కింద రూ.61.99 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి, నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

# లోక్‌సభలో వరంగల్ అభివృద్ధి ప్రస్తావన



న్యూఢిల్లీ, ఆగస్టు 4 (తెలంగాణ ముచ్చట్లు):
వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో వరంగల్ జిల్లా అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, పారిశ్రామిక ప్రగతికి సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం గతిశక్తి, ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్‌తో పాటు ఇతర కేంద్ర పథకాల కింద వరంగల్ జిల్లాకు ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక రూపొందించిందా అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పీఎం గతిశక్తి పథకం కింద వరంగల్ జిల్లాలో ఏయే మౌలిక వసతుల ప్రాజెక్టులు ప్రతిపాదించబడ్డాయి, వాటిలో ఎన్ని ఆమోదం పొందాయి, ప్రస్తుతం వాటి అమలు ఏ దశలో ఉందో సభకు వివరించాలని ఎంపీ కోరారు. జిల్లాలో రవాణా, పారిశ్రామిక, మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్రం తీసుకుంటున్న చర్యలపై స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.
ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ కింద వరంగల్ జిల్లాలోని ఏ ప్రాంతాలు ఎంపికయ్యాయో, వాటి అభివృద్ధి కోసం ఎంత మేర నిధులు కేటాయించారో వెల్లడించాలని కడియం కావ్య కోరారు. విద్య, వైద్యం, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాల కల్పన వంటి రంగాల్లో కేంద్రం చేపడుతున్న కార్యక్రమాల వివరాలను కూడా తెలియజేయాలని ప్రశ్నించారు. వరంగల్ జిల్లా అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ఉంటే, దాని కింద ఇప్పటికే మంజూరైన ప్రాజెక్టులు, భవిష్యత్తులో అమలు చేయనున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను సభలో వెల్లడించాలని ఎంపీ కోరారు. జిల్లాలో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరిగేలా కేంద్రం మరింత సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.
జిల్లా సమగ్రాభివృద్ధికి కేంద్ర పథకాలను సమర్థవంతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని కడియం కావ్య పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. వరంగల్ ప్రజల అభివృద్ధి ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని ఈ అంశాలను లోక్‌సభలో లేవనెత్తినట్లు ఎంపీ కడియం కావ్య తెలిపారు. జిల్లాకు మరిన్ని అభివృద్ధి ప్రాజెక్టులు, కేంద్ర నిధులు తీసుకురావడానికి తన వంతు కృషిని కొనసాగిస్తానని పేర్కొన్నారు.

# ఉపాధికి ఏటీసీ లే వేదిక

(మొదటి పేజీ తరువాయి)



శక్తి (కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు), గనులు, భూగర్భ శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో నూతన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ భవనానికి మంగళవారం శంకుస్థాపన చేసి ఆయన మాట్లాడారు. కృత్రిమ మేధస్సు, విద్యుత్ వాహనాలు, రోబోటిక్స్, డ్రోన్ల వంటి సాంకేతిక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో 120 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి ఆధునిక కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. వ్యవసాయ రంగంలోనూ సాంకేతికత ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో రుద్రంగి కేంద్రంలో ఆధునిక వ్యవసాయ సాంకేతిక కోర్సు ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.
ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల ఉపకార వేతనం అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. శిక్షణ ఇవ్వడమే కాకుండా ఉద్యోగం వచ్చే వరకు ప్రభుత్వం విద్యార్థులకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఐటీఐలను నిర్లక్ష్యం చేశారని, ప్రస్తుతం వాటిని ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని విమర్శించారు. విదేశీ ఉద్యోగాల కోసం తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ ద్వారా ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని మంత్రి తెలిపారు. జర్మనీ, జపాన్ తదితర దేశాల్లో నర్సులు, ఎలక్ట్రీషియన్లు, కేర్‌గివర్లు, నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణులకు భారీ డిమాండ్ ఉందన్నారు. రుద్రంగి నుంచి వంద మంది అర్హులైన యువతను ఎంపిక చేస్తే అక్కడే జర్మన్ భాష శిక్షణ అందించి, విదేశీ ఉద్యోగాల వరకు టామ్‌కామ్ పూర్తి బాధ్యత తీసుకుంటుందని వెల్లడించారు. ప్రస్తుతం మంచిర్యాలలో ఇప్పటికే వంద మంది యువతకు జర్మన్ భాష శిక్షణ కొనసాగుతోందని చెప్పారు.
జర్మనీ, జపాన్‌లో భాషా పరిజ్ఞానం కలిగిన నైపుణ్య యువతకు నెలకు రూ.2 లక్షలకు పైగా వేతనాలు లభించే అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. వచ్చే వారం నుంచే విదేశీ ఉద్యోగాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ యువత ప్రపంచ స్థాయి ఉద్యోగాలు సాధించేలా ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై మంత్రి విమర్శలు చేశారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును మార్పులు చేసి భారీ ఆర్థిక భారం రాష్ట్రంపై మోపారని ఆరోపించారు. అనంతరం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అభివృద్ధి కృషిని ప్రశంసించిన మంత్రి, నియోజకవర్గంలో రూ.200 కోట్లతో సమీకృత పాఠశాల ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రస్తావించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్, అధికారులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 1 నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు టీ–ఫైబర్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను నిర్దేశిత గడువులోగా టీ-ఫైబర్ నెట్‌వర్క్‌కు అనుసంధానం చేయాలని మంత్రి సూచించారు. అందుకు అవసరమైన మౌలిక వసతుల పనులను వేగంగా పూర్తి చేసి, ఎలాంటి జాప్యం లేకుండా అన్ని కార్యాలయాల్లో టీ-ఫైబర్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.
సెప్టెంబర్ 1 తర్వాత ప్రభుత్వ కార్యాలయాల కోసం ప్రైవేటు ఇంటర్నెట్ సేవలందించే సంస్థలకు ఎలాంటి బిల్లులు ప్రాసెస్ చేయకూడదని, చెల్లింపులు కూడా నిలిపివేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఆ తర్వాత ప్రభుత్వ కార్యాలయాలకు పూర్తిస్థాయిలో టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్త నెట్‌వర్క్ (టీ-స్వాన్)ను టీ-ఫైబర్‌కు అనుసంధానం చేసే ప్రక్రియను నెల రోజుల్లో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ శాఖలకు అంతరాయం లేకుండా నిరంతర ఇంటర్నెట్ సేవలు అందేలా సమగ్ర కార్యాచరణ చేపట్టాలని, సాంకేతిక మార్పిడి సజావుగా జరిగేలా చూడాలని సూచించారు.
ప్రతిష్ఠాత్మక ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుకు అత్యాధునిక డిజిటల్ మౌలిక వసతులు కల్పించే దిశగా అధిక వేగం కలిగిన టీ-ఫైబర్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రతి ఇంటికి ఇంటర్నెట్" కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అధిక వేగంతో కూడిన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించాలని సూచించారు. టీ-ఫైబర్ మౌలిక వసతుల బలోపేతం ద్వారా డిజిటల్ తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థలు, ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన, అందుబాటు ధరలో అధిక వేగం కలిగిన ఇంటర్నెట్ సేవలు అందించడం ద్వారా రాష్ట్రాన్ని డిజిటల్ రంగంలో మరింత ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.



## ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరుబాటలో సీపీఐ




**ఎల్కతుర్తి ఆగస్టు04 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా సమస్యల పరిష్కారం, ఎన్నికల హామీల అమలు కోసం సీపీఐ పోరుబాట పట్టిందని వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రే లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు మునిగాల భిక్షపతి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ, ఈనెల 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకు హనుమకొండ జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో సీపీఐ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో పాదయాత్రలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాదయాత్రల సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య, దెబ్బతిన్న రహదారులు, ఉపాధి హామీ పనుల అమలు, సాగునీటి ఇబ్బందులు, సంక్షేమ పథకాల అమలులో జాప్యం వంటి ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యమని వివరించారు. అలాగే ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ పాదయాత్రను ఈనెల 6న కాజీపేట మండల కేంద్రంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఈనెల 14న పాదయాత్ర ముగింపు సందర్భంగా హనుమకొండలోని వేయి స్తంభాల గుడి నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

జిల్లాలోని వ్యవసాయ కార్మికులు, రైతులు, యువత, మహిళలు, ప్రజాసంఘాల నాయకులు, సీపీఐ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని పాదయాత్రలను విజయవంతం చేయాలని కర్రే లక్ష్మణ్, మునిగాల భిక్షపతి విజ్ఞప్తి చేశారు.

## ఇంటి సరిహద్దు వివాదం ముగ్గురు అరెస్ట్



**వీణవంక, ఆగస్టు 04 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కోర్కల్ గ్రామంలో ఇంటి సరిహద్దు, దారి వివాదం నేపథ్యంలో మహిళపై దాడి చేసిన కేసులో ప్రధాన నిందితులైన కర్ర రాంగోపాల్ రెడ్డి, కర్ర గణపతి రెడ్డి, కర్ర ప్రవీణ్ రెడ్డిని వీణవంక పోలీసులు అరెస్టు చేసి సోమవారం న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కోర్కల్ గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి ఆమెపై దాడికి పాల్పడ్డారనే ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

అనంతరం చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసి ముగ్గురినీ న్యాయస్థానం ఎదుట హాజరుపరిచినట్లు వీణవంక ఎస్ఐ తిరుపతి తెలిపారు. గ్రామంలో చర్చనీయాంశంగా మారిన ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.




## సిరిపాటి వేణుకు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలి

- **బేడ బుడగ జంగం జనసంఘం డిమాండ్**


**జమ్మికుంట టౌన్ ఆగస్టు 04 (తెలంగాణ ముచ్చట్లు):** బేడ బుడగ జంగం జనసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణుకు తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి కల్పించాలని బేడ బుడగ జంగం సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. జమ్మికుంటలో తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తూర్పాటి లింగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు జిల్లా కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బేడ బుడగ జంగం సమాజ హక్కుల సాధన, సామాజిక న్యాయం, ప్రత్యేక గుర్తింపు కోసం సిరిపాటి వేణు రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తూ సమాజ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో సమాజానికి ప్రత్యేక ఉపవర్గ గుర్తింపు కల్పించాలనే డిమాండ్‌తో జిల్లాల వారీగా అవగాహన కార్యక్రమాలు, వినతిపత్రాల సమర్పణ చేపట్టారని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ గృహాలు, బేడ బుడగ జంగం ఆత్మగౌరవ భవనం నిర్మాణం, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై ఆయన నిరంతరం ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారని వివరించారు. సమాజ అభ్యున్నతికి చేసిన సేవలను గుర్తించి సిరిపాటి వేణుకు తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో తూర్పాటి శంకర్, మోతే గంగయ్య, రుద్రాక్ష పోచయ్య, పర్వత మల్లయ్య, తూర్పాటి సమ్మయ్య, తూర్పాటి జంపయ్య, తూర్పాటి సాయిలు, తూర్పాటి సారయ్య, పస్తం సమ్మయ్య, కొండపల్లి రవి, వానరాశి వెంకటయ్య, తూర్పాటి రాజు, మోతే రాజు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీకి భారీ ఎదురుదెబ్బ.. బీఆర్ఎస్ గూటికి ముగ్గురు సర్పంచ్‌లు





**ఇల్లంతకుంట,ఆగస్టు 04 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఇల్లంతకుంట మండలంలో బీజేపీకి చెందిన ముగ్గురు సర్పంచ్‌లు బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. హైదరాబాద్ నందినగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో సిరిసేడు సర్పంచ్ కుమార్-శ్యామల, వంతడుపుల సర్పంచ్ రాజేష్-మాధవి, టేకుర్తి సర్పంచ్ శ్రీనివాస్ బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు.

ఈ సందర్భంగా చేరిన సర్పంచ్‌లు మాట్లాడుతూ, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల మన్ననలు పొందాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని, బీజేపీ కూడా ప్రజా సమస్యల పరిష్కారంలో ఆశించిన స్థాయిలో పనిచేయలేదని విమర్శించారు.

గ్రామస్థాయిలో కాంగ్రెస్, బీజేపీలపై అసంతృప్తి పెరుగుతోందని, దీంతో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ వైపు వస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

హుజూరాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని, ఆయన నాయకత్వంపై విశ్వాసంతోనే తాము బీఆర్ఎస్‌లో చేరినట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


## జమ్మికుంటలో సింథటిక్ ట్రాక్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- **రూ.6.50 కోట్ల మంజూరు**




**జమ్మికుంట,ల్ టౌన్ ఆగస్టు 04 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రూ.6.50 కోట్ల వ్యయంతో 400 మీటర్ల, నాలుగు లేన్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. లోక్‌సభలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అడిగిన ప్రశ్నకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ ఈ వివరాలను వెల్లడించారు. క్రీడాకారులకు మెరుగైన శిక్షణా సదుపాయాలు కల్పించేందుకు ఈ ప్రాజెక్టుకు రూ.6.50 కోట్ల నిధులు ఆమోదించినట్లు తెలిపారు. ఈ ట్రాక్ నిర్మాణం పూర్తయితే జమ్మికుంటతో పాటు పరిసర ప్రాంతాల క్రీడాకారులకు అత్యాధునిక శిక్షణా వేదిక అందుబాటులోకి రానుంది. జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు అథ్లెట్ల ప్రతిభను మరింత మెరుగుపర్చేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



## ప్రభుత్వ పాఠశాలల సమస్యలపై సీపీఎం ఆందోళన

- **మౌలిక వసతుల కల్పనకు డిమాండ్**

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 04 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలంటే నిర్వహణ నిధులు పెంచడంతో పాటు ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ పిలుపు మేరకు జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను సీపీఎం టౌన్ కార్యదర్శి దండి గారి సతీష్ ఆధ్వర్యంలో మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కొప్పుల శంకర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉచిత విద్య అందించడం ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. మరోవైపు ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో తల్లిదండ్రులపై భారం మోపుతున్నాయని విమర్శిస్తూ, ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలోని బాలికల పాఠశాలలో ఇంగ్లిష్, గణితం ఉపాధ్యాయుల కొరతతో బోధన దెబ్బతింటోందని, వర్షపు నీరు మైదానంలో నిల్వ ఉండడంతో విద్యార్థినులు క్రీడలకు దూరమవుతున్నారని తెలిపారు. అటెండర్ పోస్టు ఖాళీగా ఉండడం, బాలికల మరుగుదొడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉండడం, "మన ఊరు-మనబడి" కింద నిర్మించిన మరుగుదొడ్ల పనులు అసంపూర్తిగా నిలిచిపోవడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచినా విద్యార్థులకు యూనిఫాంలు అందలేదని, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో నాణ్యమైన భోజనం అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు, వంట కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో అటెండర్, కంప్యూటర్ బోధకులు, నాన్‌టీచింగ్ సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పాఠశాలకు ఆడిటోరియం నిర్మించడంతో పాటు పాత భవనాల స్థానంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్, హాస్టల్ భవనాలను మంజూరు చేసి నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు వడ్లూరి కిషోర్, కన్నం సదానందం, గడ్డం శోభన్, తాటికంటి రంజిత్ కుమార్, తుర్పాటి నాగరాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.





## పరిమళ కాలనీ వాసులకు ఉచిత వైద్య సేవలు

- **సీజనల్ వ్యాధులపై అవగాహన**

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 04 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ సుధా రాజేంద్ర ఆధ్వర్యంలో జమ్మికుంట మండలం తనుగుల గ్రామ పంచాయతీ పరిధిలోని పరిమళ కాలనీలో మంగళవారం సమగ్ర వ్యాధి నిర్ధారణ ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

ఈ శిబిరంలో లెప్రసీ, ఐసీటీసీ, ఎన్‌టీఈపీ విభాగాలతో పాటు వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం పాల్గొని హెచ్ఐవీ, హెపటైటిస్‌బి, సిఫిలిస్, క్షయవ్యాధి, రక్తపోటు, మధుమేహం తదితర పరీక్షలు నిర్వహించి బాధితులకు వైద్య సలహాలు, కౌన్సెలింగ్ అందించారు. శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభుదాస్ సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు.

ఈ సందర్భంగా డాక్టర్ సుధా రాజేంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండి సమగ్ర ఆరోగ్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ప్రతి వారం 'డ్రై డే' పాటించడం అవసరమని వివరించారు.

లెప్రసీ బాధితుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి వారికి అవసరమైన పాదరక్షలను పంపిణీ చేశారు. రక్తపోటు, మధుమేహంతో బాధపడుతున్న వారు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందుబాటులో ఉన్న మందులనే వినియోగించాలని, అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే ప్రభుత్వ వైద్య సిబ్బందిని సంప్రదించి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ కార్తీక్, డీపీఎంవోలు కృపలాదేవి, ప్రకాశ్‌రావు, సీహెచ్‌వో సదానందం, హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ గౌడ్, ఏఎన్‌ఎంలు మనీ, రజిత, ఐసీటీసీ కౌన్సిలర్ మహిపాల్, ల్యాబ్ టెక్నీషియన్ ఇబ్రహీం, టీబీ స్క్రీనర్ శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బుధవారం - 05 - ఆగస్టు 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ఖాజా హుస్సేన్,ఎన్ హెచ్‌ఎం జేఏసీ జిల్లా కోఆర్డినేటర్



**వనపర్తి,ఆగస్టు04(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రంలో ప్రజారోగ్య సేవలను నిరంతరం అందిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జిల్లా సమన్వయకర్త ఖాజా హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయడంతో పాటు, ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు జమయ్యేలా శాశ్వత వ్యవస్థను అమలు చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు అంకితభావంతో సేవలందిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నేటికీ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. వేతనాల చెల్లింపులో తరచూ జాప్యం జరుగుతుండటంతో ఉద్యోగులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గతంలో కూడా పెండింగ్ వేతనాలు, ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశాలపై పలుమార్లు ఆందోళనలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు.వైద్యుల నుంచి కాంటింజెంట్ ఉద్యోగుల వరకు సుమారు 17 వేల మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను, 78 కేడర్లలో పనిచేస్తున్న వారందరినీ ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలని ఖాజా హుస్సేన్ డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, హక్కులు, సంక్షేమానికి సంబంధించిన అన్ని సమస్యలకు ప్రభుత్వం తక్షణ పరిష్కారం చూపాలని కోరారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అహర్నిశలు సేవలందిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పట్ల ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు సిద్ధంగా ఉన్నామని ఖాజా హుస్సేన్ హెచ్చరించారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# "మేము సగం – మాకు సగం" నినాదంతో బీసీల ఐక్యతకు పిలుపు



- హుజురాబాద్‌లో బీసీ మ్యానిఫెస్టో ఆవిష్కరణ

**హుజురాబాద్, ఆగస్టు 4(తెలంగాణ ముచ్చట్లు ):** జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో సగం వాటా దక్కినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని బీసీ దళపతి, కుల గణన కోసం దేశవ్యాప్త కోటి ఉత్తరాల ఉద్యమ రూపకర్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు.

మంగళవారం హుజురాబాద్‌లో బీసీ ఉద్యమ నాయకుడు బండారి సదానందం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక నాయకులతో కలిసి "బీసీ మ్యానిఫెస్టో" పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ, అడవిలోని పులులను అడుగుజాడల ఆధారంగా, రోడ్డుపై ఉన్న చెట్లను, పశువులను సైతం లెక్కిస్తున్నప్పుడు దేశ జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలను ఎందుకు సమగ్రంగా లెక్కించడం లేదని ప్రశ్నించారు. బీసీల పట్ల రాజకీయ పార్టీలకు భయమా, చులకనా, నిర్లక్ష్యమా అనే సందేహం కలుగుతోందని వ్యాఖ్యానించారు.

బీసీ వర్గాల్లోని అన్ని కుల సంఘాలు ఒకే వేదికపైకి వచ్చి హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాజీపేట శ్రీనివాస్, కూరపాటి రామచంద్రం, సంగెం శ్రీనివాస్, పంజాల వెంకటేష్, సత్యనారాయణ, నేరెళ్ల మహేందర్ గౌడ్, శ్రీనివాస్, గాలి సమ్మయ్య, పుల్ల రాధతో పాటు వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఏఐవైఎఫ్ మహాసభల పోస్టర్ల విడుదల




- యాదగిరిగుట్ట రాష్ట్ర మహాసభలకు భారీగా తరలిరావాలని పిలుపు

**కరీంనగర్, ఆగస్టు 4(తెలంగాణ ముచ్చట్లు ):**కరీంనగర్ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో మంగళవారం ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వచ్చేనెల ఎనిమిది , తొమ్మిది , పది తేదీల్లో యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువజనులు, ఏఐవైఎఫ్ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి యుగంధర్‌తో పాటు మొత్తం ఎనిమిది మంది ఏఐవైఎఫ్ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్ర మహాసభల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# శిశు సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలే అమృతం



**పెద్దమందడి,ఆగస్టు04(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మంగంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను అంగన్‌వాడీ టీచర్ నారాయణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ నారాయణమ్మ తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలలో తల్లిపాల పాత్రపై గర్భిణులు, బాలింతలు, తల్లులకు అవగాహన కల్పించారు.జననం నుంచి తొలి ఆరు నెలల వరకు శిశువులకు తల్లిపాలు మాత్రమే అందించడం ద్వారా వారికి అవసరమైన సంపూర్ణ పోషకాహారం లభిస్తుందని నారాయణమ్మ వివరించారు. తల్లిపాలు శిశువులలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడతాయని తెలిపారు. తల్లిపాలను సరైన సమయంలో, క్రమం తప్పకుండా అందించడం ద్వారా శిశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమేష్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్ నారాయణమ్మ, ఆయా, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.





# కాట్రపల్లిలో ఘనంగా గ్రామసభ – పాఠశాలలో బాలసభ నిర్వహణ

- గ్రామాభివృద్ధి, విద్యార్థుల సంక్షేమంపై కీలక నిర్ణయాలు

**హుజూరాబాద్, ఆగస్టు 4(తెలంగాణ ముచ్చట్లు ):** హుజూరాబాద్ మండలంలోని కాట్రపల్లి గ్రామంలో మంగళవారం గ్రామ సభతో పాటు యూపీఎస్ పాఠశాలలో బాలసభను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ కుమార్, సర్పంచ్ పెరుమాండ్ల హైమా బిక్షపతి, ఉప సర్పంచ్ గంగదారి బిక్షపతి ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామసభలో గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రామంలోని వీవో (VO) భవన నిర్మాణం, అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ గోడ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అలాగే పంచాయతీ పరిధిలో గతంలో జరిగిన ఆర్థిక లావాదేవీల వివరాలను ప్రజల ముందుంచి పారదర్శకంగా సమీక్ష నిర్వహించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని గ్రామస్తులు కోరారు. దోమలు, ఈగల నివారణ కోసం బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ చేపట్టడం, గ్రామంలో ప్రతి ఇంటికి నిరంతరాయంగా రక్షిత తాగునీటిని సరఫరా చేయడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అనంతరం యూపీఎస్ పాఠశాలలో నిర్వహించిన బాలసభలో విద్యార్థుల సంక్షేమం, పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధిపై చర్చించారు. మరుగుదొడ్ల పరిశుభ్రత, నిరంతర నీటి సౌకర్యం, పరిశుభ్రమైన మధ్యాహ్న భోజన వంటగది ఏర్పాటు, విద్యార్థుల శారీరక-మానసిక వికాసానికి అవసరమైన ఆట వస్తువుల కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాల్లో వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, హెల్త్ వర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి, పాఠశాల పురోగతి కోసం ప్రజలందరూ సమిష్టిగా కృషి చేయాలని ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు.

# ఆర్‌ఎస్ ప్రవీణ్‌కు భద్రత కల్పించాలి

- హుజురాబాద్‌లో బీసీ సంఘాల నిరసన



**హుజురాబాద్, ఆగస్టు 4(తెలంగాణ ముచ్చట్లు ):** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ప్రభుత్వం తగిన భద్రతను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హుజురాబాద్‌లో బీసీ సంఘాలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నాయకులు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా స్వేరో మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి అకినపల్లి శిరీష మాట్లాడుతూ, రెండు దశాబ్దాలకు పైగా ఐపీఎస్ అధికారిగా ప్రజలకు సేవలందించిన డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకులాల సంస్థల కార్యదర్శిగా పనిచేసిన కాలంలో వేలాది మంది పేద, అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధన, సామాజిక న్యాయం, రాజ్యాధికార లక్ష్యాల కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడికి భద్రత తగ్గించడం సరైన నిర్ణయం కాదని పేర్కొన్నారు. ప్రజా జీవితంలో కీలక పాత్ర పోషిస్తున్న నాయకులకు భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, రాజకీయ విభేదాలకు అతీతంగా ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించే విధంగా ప్రభుత్వం వ్యవహరించాలని ఆమె కోరారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు గతంలో ఉన్న భద్రతను యథాతథంగా కొనసాగించాలని, వెంటనే భద్రతా ఏర్పాట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు సందుపట్ల జనార్దన్, జేఏసీ అధ్యక్షుడు సండేలా వెంకన్న, స్వేరో రాష్ట్ర కార్యదర్శి గడిప రాజు, జేఏసీ ప్రధాన కార్యదర్శి చిలుకమార్తి శ్రీనివాస్, జేఏసీ మహిళా రాష్ట్ర జనరల్ సెక్రటరీ దేవసాని ప్రియదర్శిని, సృజన, కొలిపాక క్రాంతి, మామూనూరి ప్రవీణ్ తదితర నాయకులు పాల్గొన్నారు. విద్యార్థులు, బీసీ సంఘాల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై నిరసనకు మద్దతు తెలిపారు. ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని గౌరవించి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రత విషయంలో తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.

# మల్లయ్య హత్యపై న్యాయవాదుల నిరసన

- విధులు బహిష్కరించి ప్రభుత్వానికి భద్రతా చర్యలపై విజ్ఞప్తి




**కరీంనగర్, ఆగస్టు 4(తెలంగాణ ముచ్చట్లు ):**నాగర్‌కర్నూలు జిల్లా పెంటలవెల్లి గ్రామంలో న్యాయవాది బోగిని మల్లయ్య దారుణ హత్యను ఖండిస్తూ కరీంనగర్ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ నాయకత్వంలో ఉదయం పది గంటల నుంచి ఇరవై నిముషాలు విధులను బహిష్కరించి తమ నిరసనను వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో సుమారు ఇరవై మంది న్యాయవాదులు పాల్గొన్నారు. రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం కట్టడి చేయాలని, న్యాయవాదుల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. నిందితులను చట్టం ప్రకారం కఠినంగా శిక్షించి, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. కాగా, జూలై 31న నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం పెంటలవెల్లి గ్రామంలో రోగుల వేషంలో వచ్చిన దుండగులు 55 ఏళ్ల న్యాయవాది బోగిని మల్లయ్యపై కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పలు బార్ అసోసియేషన్లు ఆందోళనలు చేపడుతున్నాయి.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






## ప్రత్యేక పూజలు, అన్నదానంతో పింగిలి రమేష్ జన్మదిన వేడుకలు ఘనం

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 04 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిలి రమేష్ జన్మదిన వేడుకలను జమ్మికుంట పట్టణంలో అభిమానులు, ప్రజలు ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం గాంధీ చౌరస్తాలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేస్తూ పింగిలి రమేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రజాసేవలో పింగిలి రమేష్ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని, అన్నదానం, స్వీట్ల పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా సమాజ సేవకు ప్రాధాన్యం చాటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జె.కె., కుమార్, శ్రీకాంత్, రమేష్, మహేష్‌తో పాటు పలువురు అభిమానులు, నాయకులు, ప్రజలు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ముగిసింది.

## రైళ్లలో ట్రాన్స్‌జెండర్‌ల వేధింపులు

- ప్రయాణికుల నుంచి పెరుగుతున్న ఫిర్యాదులు
- బలవంతంగా డబ్బులు అడుగుతున్నారనే ఆరోపణలు
- రైల్వేల్లో కఠిన చర్యలకు డిమాండ్
- ప్రయాణికుల భద్రతపై ఆందోళన



**డెస్క్, ఆగస్టు 4 (తెలంగాణ ముచ్చట్లు):** దేశంలోని పలు రైళ్లలో కొందరు ట్రాన్స్‌జెండర్‌లు ప్రయాణికులను బలవంతంగా డబ్బులు అడుగుతున్నారనే ఫిర్యాదులు మళ్లీ చర్చనీయాంశమయ్యాయి. డబ్బులు ఇవ్వకపోతే దురుసుగా ప్రవర్తించడం, అసభ్యకరంగా వేధించడం వంటి ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం అవుతున్నాయి. ప్రయాణికుల కథనం ప్రకారం, రద్దీగా ఉండే రైళ్లలో కొందరు ట్రాన్స్‌జెండర్‌లు బోగీల్లో తిరుగుతూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, నిరాకరిస్తే అసభ్యంగా మాట్లాడటం, బెదిరించడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని చెబుతున్నారు. మహిళలు, వృద్ధులు, కుటుంబాలతో ప్రయాణించే వారు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొంటున్నారు. ఇలాంటి ఘటనలపై రైల్వే రక్షణ దళం, ప్రభుత్వ రైల్వే పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి, చట్టవిరుద్ధంగా ప్రయాణికులను వేధించే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రద్దీ మార్గాల్లో భద్రతా బలగాల గస్తీని మరింత పెంచాలని సూచిస్తున్నారు. అయితే, చట్టాన్ని ఉల్లంఘించే వ్యక్తులపైనే చర్యలు తీసుకోవాలని, కొందరి ప్రవర్తనను మొత్తం ట్రాన్స్‌జెండర్ సమాజానికి ఆపాదించడం సరైంది కాదని సామాజిక వర్గాలు పేర్కొంటున్నాయి. గౌరవప్రదంగా జీవనం సాగిస్తున్న ట్రాన్స్‌జెండర్‌ల హక్కులను కాపాడుతూనే, ప్రయాణికులను వేధించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడుతున్నాయి. ప్రయాణికుల భద్రత కోసం రైల్వేల్లో నిఘాను మరింత పటిష్ఠం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. సీసీటీవీ పర్యవేక్షణ, ఆర్‌పీఎఫ్ గస్తీ, అత్యవసర ఫిర్యాదు వ్యవస్థలను మరింత సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ఇలాంటి ఘటనలను అరికట్టవచ్చని అభిప్రాయపడుతున్నారు. ప్రతి ప్రయాణికుడు భయాందోళనలు లేకుండా సురక్షితంగా ప్రయాణించే వాతావరణాన్ని కల్పించడం రైల్వేల బాధ్యతగా నిపుణులు పేర్కొంటున్నారు. చట్టాన్ని ఉల్లంఘించి ప్రయాణికులను వేధించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజల్లో అవగాహన పెంచే చర్యలు కూడా చేపట్టాలని సూచిస్తున్నారు.







## ప్రజల భాగస్వామ్యంతోనే ఆదర్శ గ్రామ నిర్మాణం

- బేతిగల్‌లో గ్రామాభివృద్ధి కమిటీ ఏర్పాటు

**వీణవంక, ఆగస్టు 04 (తెలంగాణ ముచ్చట్లు-):** గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, ప్రజల సహకారంతోనే ఆదర్శ గ్రామాల నిర్మాణం సాధ్యమవుతుందని జమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన అన్నారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బేతిగల్ గ్రామంలో మంగళవారం 'ఆదర్శ గ్రామం - ఆవశ్యకత' అంశంపై నిర్వహించిన మినీ గ్రామసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్ఫూర్తిని ఆచరణలోకి తీసుకురావాలంటే గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి, గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. గ్రామ సర్పంచ్ చొప్పరి సారమ్మ-సారయ్య మాట్లాడుతూ, బాలవికాస సంస్థ తమ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయడం సంతోషకరమని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యంతో కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్లు కె. సుమలత, ఏ. స్వాతి, ఆసియా, ఉపసర్పంచ్ మడ్డి మహేష్, కారోబార్ పల్లెర్ల మహేష్, పంచాయతీ కార్యదర్శి నవీన్, వార్డు సభ్యులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, యువజన నాయకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వాషింగ్టన్‌లో కార్చిచ్చు విలయం





- 65 వేల మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- 700కుపైగా ఇళ్లు, నిర్మాణాలు దగ్ధం
- కార్చిచ్చుకు కారణమన్న ఆరోపణలతో వ్యక్తి అరెస్ట్
- రాష్ట్రంలో అత్యవసర పరిస్థితి ప్రకటించిన ట్రంప్

**వాషింగ్టన్, ఆగస్టు 4 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రంలో కార్చిచ్చులు తీవ్ర విధ్వంసం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా తూర్పు వాషింగ్టన్‌లోని స్పోకేన్ నగరం, పరిసర ప్రాంతాల్లో మంటలు వేగంగా వ్యాపిస్తుండటంతో సుమారు 65 వేల మందికి పైగా తమ ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. ఈ విపత్తులో వందలాది ఇళ్లు, ఇతర నిర్మాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అధికారుల వివరాల ప్రకారం స్పోకేన్ నగర పరిసరాల్లో చెలరేగిన మూడు ప్రధాన కార్చిచ్చులు ఇంకా పూర్తిగా అదుపులోకి రాలేదు. ఇది తమ ప్రాంతం చరిత్రలోనే అత్యంత తీవ్రమైన ప్రకృతి విపత్తులలో ఒకటిగా స్పోకేన్ మేయర్ లీసా బ్రౌన్ పేర్కొన్నారు. ప్రాణనష్టం, ఆస్తినష్టంపై అధికారులు సమగ్రంగా అంచనా వేస్తున్నట్లు తెలిపారు. అమెరికన్ రెడ్ క్రాస్ ప్రాథమిక అంచనా ప్రకారం ఇప్పటివరకు 700కుపైగా ఇళ్లు, ఇతర నిర్మాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు ఆహారం, తాగునీరు, అత్యవసర సదుపాయాలు అందిస్తున్నారు. 'ఓల్డ్ ట్రెయిల్స్ ఫైర్'కు సంబంధించి ఆరోన్ ఎఫ్. ఫారినా (37) అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఉద్దేశపూర్వకంగా మంటలు పెట్టినట్లు ఆరోపిస్తూ అతనిపై ప్రథమ శ్రేణి నేరం కింద కేసు నమోదు చేశారు. ఒక మిలియన్ డాలర్ల పూచీకత్తుతో అతడిని అదుపులోకి తీసుకున్నట్లు స్పోకేన్ కౌంటీ షెరీఫ్ జాన్ నోవెల్స్ వెల్లడించారు. మంటల కారణంగా సర్వం కోల్పోయిన బాధితులు తిరిగి తమ ఇళ్లకు చేరుకుని కాలిపోయిన శిథిలాలను చూసి భావోద్వేగానికి గురవుతున్నారు. "ఇక్కడ కాపాడుకోవడానికి ఏమీ మిగల్లేదు" అని 76 ఏళ్ల మిరియం సిమ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ప్రారంభమైన మంటలు ఇప్పటికే 8,026 ఎకరాలకు పైగా విస్తరించాయని అధికారులు తెలిపారు. వాతావరణం కొంత అనుకూలించడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. పరిస్థితిపై రాష్ట్ర గవర్నర్ బాబ్ ఫెర్గుసన్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ఈ వారం ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.





## స్థిరంగా బంగారం ధరలు..



**హైదరాబాద్, ఆగస్టు 4, 2026 (తెలంగాణ ముచ్చట్లు):** దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు మంగళవారం స్థిరంగా కొనసాగాయి. అమెరికా-ఇరాన్ చర్చల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గడంతో పసిడి ధరల పెరుగుదలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. గత రెండు ట్రేడింగ్ సెషన్‌లుగా బంగారం ధరల్లో పెద్దగా మార్పులు కనిపించలేదు.
మంగళవారం ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,220గా నమోదైంది. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,32,190గా ఉండగా, 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,08,150గా కొనసాగుతోంది.
తెలంగాణలోని వరంగల్, నిజామాబాద్, ఖమ్మం వంటి ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు హైదరాబాద్‌తో సమానంగానే నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కాకినాడ, తిరుపతిల్లోనూ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,210గా కొనసాగింది. 22 క్యారెట్ల బంగారం రూ.1,32,190, 18 క్యారెట్ల బంగారం రూ.1,08,150గా నమోదైంది.
దేశంలోని ప్రధాన నగరాల్లో చెన్నైలో బంగారం ధరలు అత్యధికంగా నమోదయ్యాయి. అక్కడ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,560గా ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,32,510, 18 క్యారెట్ల ధర రూ.1,10,660గా ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం రూ.1,44,360, 22 క్యారెట్ల బంగారం రూ.1,32,340గా నమోదైంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు, పుణె నగరాల్లో మాత్రం హైదరాబాద్‌తో సమానంగా ధరలు కొనసాగుతున్నాయి.
అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితులు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై అంచనాలు, డాలర్ కదలికలు రానున్న రోజుల్లో బంగారం ధరలపై ప్రభావం చూపే అవకాశముందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ధరలు స్థిరంగా ఉండటంతో పసిడి కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది అనుకూల సమయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పరిశుభ్రతకు తొలి అడుగు..
# అంతర్వస్త్రాల ప్రాధాన్యం

- **వ్యక్తిగత ఆరోగ్యానికి రోజువారీ శుభ్రత అవసరం**
- **నాణ్యమైన వస్త్రాల వినియోగంపై అవగాహన**
- **వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి గుర్తింపు దినం**
- **సరైన అలవాట్లతో ఆరోగ్యవంతమైన జీవనం**



ప్రతి ఏడాది ఆగస్టు 5న జాతీయ అండర్‌వేర్ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. వ్యక్తిగత పరిశుభ్రతలో అంతర్వస్త్రాల ప్రాధాన్యాన్ని గుర్తు చేయడం, నాణ్యమైన వస్త్రాల వినియోగంపై అవగాహన కల్పించడం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధిని ప్రోత్సహించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. శరీరానికి నేరుగా తగిలే దుస్తుల్లో అంతర్వస్త్రాలు అత్యంత ముఖ్యమైనవి. వాటిని సరైన విధంగా ఉపయోగించడం, ప్రతిరోజూ మార్చడం, పరిశుభ్రంగా ఉంచడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మనిషి దైనందిన జీవితంలో అంతర్వస్త్రాలు కీలకమైన పాత్ర పోషిస్తాయి. శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు బాహ్య దుస్తులను చెమట, తేమ, మురికి నుంచి రక్షిస్తాయి. రోజంతా సౌకర్యంగా ఉండేందుకు, శరీరానికి అవసరమైన మద్దతు అందించేందుకు ఇవి ఉపయోగపడతాయి. వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా సరైన నాణ్యత కలిగిన అంతర్వస్త్రాలను ధరించడం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉండటంతో పాటు అసౌకర్యం కూడా తగ్గుతుంది.

వ్యక్తిగత పరిశుభ్రతలో అంతర్వస్త్రాల నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఒకే అంతర్వస్త్రాన్ని వరుసగా ఉపయోగించడం, తడిగా ఉన్న దుస్తులను ధరించడం, సరిగా ఉతకకుండా మళ్లీ వినియోగించడం వంటి అలవాట్లు చర్మ సంబంధిత సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుంది. అందుకే ప్రతిరోజూ శుభ్రమైన అంతర్వస్త్రాలను ధరించడం, ఉతికిన తర్వాత పూర్తిగా ఆరబెట్టడం, వ్యక్తిగతంగా మాత్రమే ఉపయోగించడం వంటి అలవాట్లు ప్రతి ఒక్కరూ పాటించాలి. వైద్యుల అభిప్రాయం ప్రకారం పత్తితో తయారైన అంతర్వస్త్రాలు ఎక్కువ సందర్భాల్లో అనుకూలంగా ఉంటాయి. ఇవి గాలి ప్రసరణకు సహాయపడటంతో పాటు చెమటను సులభంగా గ్రహిస్తాయి. శరీరానికి మరీ బిగుతుగా ఉండే అంతర్వస్త్రాలు అసౌకర్యంతో పాటు కొన్ని ఆరోగ్య సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉంది. అందువల్ల శరీరానికి సరిపోయే పరిమాణంలో, నాణ్యమైన వస్త్రంతో తయారైన అంతర్వస్త్రాలను ఎంపిక చేసుకోవడం అవసరం.

అంతర్వస్త్రాల తయారీ ప్రపంచ వస్త్ర పరిశ్రమలో ఒక ప్రధాన విభాగంగా అభివృద్ధి చెందింది. ఆధునిక సాంకేతికతతో వివిధ వయసుల వారికి, వివిధ అవసరాలకు అనుగుణంగా అనేక రకాల ఉత్పత్తులు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఈ రంగం ద్వారా లక్షలాది మందికి ఉపాధి లభిస్తుండగా, దేశాల ఆర్థికాభివృద్ధికి కూడా ఇది తోడ్పడుతోంది. భారతదేశం కూడా ప్రపంచ వస్త్ర తయారీ రంగంలో ప్రముఖ స్థానాన్ని సంపాదించడంతో ఈ పరిశ్రమ మరింత విస్తరిస్తోంది. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా కూడా వస్త్ర పరిశ్రమలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సేంద్రియ పత్తి, పునర్వినియోగ పదార్థాలతో తయారైన అంతర్వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతోంది. రసాయనాల వినియోగాన్ని తగ్గించడం, నీటి వినియోగాన్ని ఆదా చేయడం, పర్యావరణహిత తయారీ విధానాలను ప్రోత్సహించడం వంటి చర్యలు ఈ రంగంలో వేగంగా అమలవుతున్నాయి. వినియోగదారులు కూడా పర్యావరణానికి మేలు చేసే ఉత్పత్తులను ఎంచుకునే ధోరణి పెరుగుతోంది.

ఆరోగ్యకరమైన జీవనశైలిలో పరిశుభ్రమైన దుస్తులు ఒక ముఖ్యమైన భాగం. చేతులు కడుక్కోవడం, ప్రతిరోజూ స్నానం చేయడం ఎంత అవసరమో, శుభ్రమైన అంతర్వస్త్రాలను ఉపయోగించడం కూడా అంతే అవసరం. ముఖ్యంగా పిల్లలు, యుక్తవయస్కులు, క్రీడాకారులు, ఎక్కువ సమయం బయట పనిచేసే వారు ఈ విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్న చిన్న పరిశుభ్రత అలవాట్లే పెద్ద ఆరోగ్య సమస్యలను నివారించగలవు. నాణ్యమైన అంతర్వస్త్రాలను కొనుగోలు చేసే సమయంలో వస్త్రం నాణ్యత, పరిమాణం, సౌకర్యం, మన్నిక వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఆకర్షణీయమైన రూపం కంటే ఆరోగ్యానికి అనుకూలమైన ఉత్పత్తులను ఎంపిక చేసుకోవడం మంచిది. అలాగే కాలానుగుణంగా పాతబడిన లేదా దెబ్బతిన్న అంతర్వస్త్రాలను మార్చడం కూడా వ్యక్తిగత పరిశుభ్రతలో భాగమే.

జాతీయ అండర్‌వేర్ దినోత్సవం కేవలం ఒక వస్త్రానికి సంబంధించిన దినోత్సవం మాత్రమే కాదు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య అవగాహన, నాణ్యమైన జీవనశైలి, వస్త్ర పరిశ్రమ ప్రాధాన్యాన్ని గుర్తు చేసే సందర్భంగా దీనిని చూడాలి. శుభ్రమైన అంతర్వస్త్రాల వినియోగాన్ని రోజువారీ అలవాటుగా మార్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. పరిశుభ్రతే ఆరోగ్యానికి పునాది అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టినప్పుడే ఈ దినోత్సవం నిజమైన సార్థకతను పొందుతుంది.

# రహదారులపై పెరుగుతున్న కోపం



మనిషి జీవితం వేగంగా మారుతున్న కొద్దీ రహదారులపై రద్దీ కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. నగరాల్లోనే కాదు, చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా వాహనాల సంఖ్య రోజురోజుకూ అధికమవుతోంది. అయితే రవాణా సౌకర్యాలు పెరగడం ఎంత శుభపరిణామమో, రహదారులపై అసహనం, ఆవేశం, కోపం పెరగడం అంతే ఆందోళన కలిగించే అంశంగా మారింది. చిన్న చిన్న విషయాలకే వాహనదారులు ఒకరిపై ఒకరు అరవడం, దూషించుకోవడం, కొట్టుకోవడం, కొన్నిసార్లు ప్రాణాలు తీసుకునే స్థాయికి వెళ్లడం సమాజానికి ప్రమాదకర సంకేతం. రహదారి అనేది గమ్యస్థానానికి చేరుకునే మార్గం మాత్రమే కాదు, ప్రతి ఒక్కరి సంయమనం, సంస్కారం, బాధ్యతను పరీక్షించే వేదిక కూడా.

రహదారులపై కనిపించే కోపానికి అనేక కారణాలు ఉన్నాయి. ట్రాఫిక్ రద్దీ, సమయానికి చేరుకోవాలనే ఒత్తిడి, ఉద్యోగ జీవితంలోని మానసిక ఆందోళనలు, నిద్రలేమి, అధిక వేగంతో ప్రయాణించే అలవాటు, నియమాలను పట్టించుకోని కొందరి నిర్లక్ష్యం వంటి అంశాలు మనుషుల్లో అసహనాన్ని పెంచుతున్నాయి. కొన్నిసార్లు చిన్న పొరపాటు జరిగినా దానిని అర్థం చేసుకునే ఓపిక లేకుండా గొడవలకు దిగడం నిత్యకృత్యంగా మారుతోంది. ఒక క్షణం ఆవేశంతో తీసుకునే నిర్ణయం జీవితాంతం పశ్చాత్తాపానికి కారణమవుతుందనే విషయాన్ని చాలామంది మరిచిపోతున్నారు.

రహదారిపై ప్రతి ఒక్కరికీ సమాన హక్కు ఉంది. కార్లు, బస్సులు, లారీలు, ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు, పాదచారులు అందరూ ఒకే రహదారిని వినియోగిస్తారు. అందువల్ల పరస్పర గౌరవం, సహనం, బాధ్యత అనే మూడు విలువలు తప్పనిసరిగా ఉండాలి. ఎవరో ఒకరు పొరపాటు చేశారని ప్రతీకారం తీర్చుకోవాలని భావించడం లేదా వెంటనే వాగ్వాదానికి దిగడం సమస్యను మరింత తీవ్రమం చేస్తుంది. తప్పు జరిగినప్పుడు కోపంతో స్పందించకుండా ప్రశాంతంగా వ్యవహరించడం ద్వారానే అనేక ఘర్షణలను నివారించవచ్చు. అధిక వేగం కూడా రహదారులపై కోపాన్ని పెంచే ప్రధాన కారణాల్లో ఒకటి. వేగంగా వెళ్లాలనే ఆత్రుతలో సిగ్నళ్లను దాటడం, ప్రమాదకరంగా ఓవర్‌టేక్ చేయడం, హారన్‌ను విచక్షణారహితంగా వినియోగించడం వంటి చర్యలు ఇతర వాహనదారుల్లో అసహనాన్ని కలిగిస్తాయి. దీనివల్ల వాగ్వాదాలు, ప్రమాదాలు, ప్రాణనష్టాలు సంభవిస్తున్నాయి. కొన్ని నిమిషాల సమయాన్ని ఆదా చేయాలనే ప్రయత్నం జీవితాన్నే ప్రమాదంలోకి నెట్టే పరిస్థితులను సృష్టిస్తోంది.

మొబైల్ ఫోన్ వినియోగం కూడా రహదారులపై సమస్యలను పెంచుతోంది. వాహనం నడుపుతూ ఫోన్‌లో మాట్లాడటం, సందేశాలు చూడటం, దృష్టి మరల్చే ఇతర చర్యలు చేయడం వల్ల వెనుక వస్తున్న వాహనాలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ నిర్లక్ష్యం కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటమే కాకుండా ఇతరుల్లో కోపం పెరుగుతోంది. రహదారిపై పూర్తి ఏకాగ్రతతో ప్రయాణించడం ప్రతి వాహనదారుడి బాధ్యత. సహనం అనేది బలహీనతకు గుర్తు కాదు. అది పరిపక్వతకు, బాధ్యతకు, మానవత్వానికి నిదర్శనం. ట్రాఫిక్‌లో కొన్ని నిమిషాలు ఆగాల్సి వచ్చినా, ఎవరైనా ముందుకు వెళ్లినా, పొరపాటున చిన్న ఇబ్బంది కలిగించినా శాంతంగా స్పందించే వ్యక్తి నిజమైన బాధ్యతాయుత పౌరుడు. ఒక చిరునవ్వు, ఒక క్షమాపణ, ఒక చిన్న సంయమనం పెద్ద గొడవలను నివారించగలవు. రహదారిపై విజయం అంటే ముందుగా చేరడం కాదు, సురక్షితంగా చేరడం.

ఈ సమస్యను తగ్గించడంలో ప్రభుత్వం, ట్రాఫిక్ పోలీసులు, విద్యాసంస్థలు, కుటుంబాలు కలిసి పనిచేయాలి. ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలి. పాఠశాల స్థాయి నుంచే రహదారి భద్రత, క్రమశిక్షణ, సహనం వంటి విలువలను విద్యార్థులకు బోధించాలి. కఠినమైన చట్టాలతో పాటు బాధ్యతాయుత పౌరస్ఫూర్తిని పెంపొందించే చర్యలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. కుటుంబ వాతావరణం కూడా వ్యక్తి ప్రవర్తనను ప్రభావితం చేస్తుంది. పిల్లలు పెద్దలను చూసే నేర్చుకుంటారు. తల్లిదండ్రులు రహదారిపై ఓపికగా వ్యవహరిస్తే అదే అలవాటు పిల్లల్లో కూడా పెరుగుతుంది. ట్రాఫిక్ నియమాలను పాటించడం, ఇతరులకు దారి ఇవ్వడం, అవసరం లేని హారన్ వినియోగించకపోవడం వంటి చిన్న అలవాట్లు మంచి సమాజ నిర్మాణానికి దోహదపడతాయి.

సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా, రహదారిపై ప్రమాదాలను పూర్తిగా నివారించేది మన ప్రవర్తనే. స్మార్ట్ సిగ్నళ్లు, సీసీ కెమెరాలు, జరిమానాలు అన్నీ అవసరమే. కానీ వాటికంటే గొప్పది మనసులో ఉండే బాధ్యత. మనం పాటించే ఒక్క నియమం, మనం చూపించే ఒక్క క్షణం సహనం మరొకరి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంది. రహదారులపై పెరుగుతున్న కోపం సమాజంలో పెరుగుతున్న అసహనానికి ప్రతిబింబం. దీనికి పరిష్కారం మరింత కోపం కాదు, మరింత సహనం. గమ్యం కంటే ప్రయాణం సురక్షితంగా ఉండటమే ముఖ్యమనే భావన ప్రతి ఒక్కరిలో పెరగాలి. రహదారిపై సంయమనం పాటించే వ్యక్తి తన ప్రాణాలను మాత్రమే కాదు, ఇతరుల జీవితాలను కూడా గౌరవిస్తున్నట్టే. సహనం, క్రమశిక్షణ, పరస్పర గౌరవం అనే మూడు విలువలు ప్రతి వాహనదారుడి జీవన విధానంగా మారినప్పుడే ప్రమాదాలు తగ్గి, రహదారులు నిజమైన అర్థంలో సురక్షిత మార్గాలుగా నిలుస్తాయి.



# గృహ హింస చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలి

ప్రేమ, భద్రత, పరస్పర గౌరవానికి నిలయంగా ఉండాల్సిన కుటుంబం ఎంతోమంది మహిళలకు హింసకు కేంద్రంగా మారుతోంది. శారీరక దాడులు మాత్రమే కాదు, మానసిక వేధింపులు, లైంగిక హింస, ఆర్థిక నియంత్రణ, అవమానాలు, భావోద్వేగ హింస కూడా మహిళల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. భారతదేశంలో గృహహింసను అరికట్టేందుకు గృహహింస నుండి మహిళల రక్షణ చట్టం-2005 అమల్లో ఉన్నప్పటికీ, సమస్య చట్టాల కొరత వల్ల కాదు; వాటి అమలులోని బలహీనత వల్లనే కొనసాగుతోందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

భారత రాజ్యాంగంలోని అధికరణలు 14, 15, 21 మహిళలకు సమానత్వం, వివక్షరహిత జీవనం, గౌరవప్రదమైన జీవిత హక్కును కల్పిస్తున్నాయి. ఈ రాజ్యాంగ స్ఫూర్తితో రూపొందిన గృహహింస చట్టం 26 అక్టోబర్ 2006 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ చట్టం మహిళలకు శిక్షాత్మక న్యాయంతో పాటు తక్షణ పౌర రక్షణను కూడా కల్పిస్తుంది. సెక్షన్-18 కింద రక్షణ ఉత్తర్వు, సెక్షన్-19 కింద నివాస ఉత్తర్వు, సెక్షన్-20 కింద ఆర్థిక ఉపశమనం, సెక్షన్-21 కింద పిల్లల సంరక్షణ ఉత్తర్వు, సెక్షన్-22 కింద పరిహార ఉత్తర్వు వంటి కీలక హక్కులను కల్పించింది. బాధిత మహిళను ఇంటి నుంచి వెళ్లగొట్టకుండా నివాస హక్కు కల్పించడం, ప్రత్యామ్నాయ నివాసం, ఆర్థిక సహాయం, వేధింపులను నిలిపివేయడం వంటి విస్తృత అధికారాలను మేజిస్ట్రేట్‌కు ఈ చట్టం ఇచ్చింది.

అయితే చట్టం కాగితంపై బలంగా ఉన్నా, అమలు బలహీనంగానే ఉంది. అవగాహన లోపం, రక్షణ అధికారుల కొరత, ఆశ్రయ గృహాలు, కౌన్సెలింగ్ కేంద్రాలు, వైద్య సహాయం, అత్యవసర ఆర్థిక సాయం వంటి సహాయక వ్యవస్థల లోపం, న్యాయ ప్రక్రియలో జాప్యం కారణంగా బాధిత మహిళలు తక్షణ ఉపశమనం పొందలేకపోతున్నారు. పలు జిల్లాల్లో ఇతర శాఖల అధికారులకే అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల రక్షణ అధికారుల వ్యవస్థ ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదు.

గణాంకాలు పరిస్థితి తీవ్రతను వెల్లడిస్తున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 (2019-21) ప్రకారం 18-49 సంవత్సరాల వయస్సు గల వివాహిత మహిళల్లో 29.3 శాతం మంది జీవితంలో ఏదో ఒక దశలో భర్త నుంచి శారీరక లేదా లైంగిక హింసను ఎదుర్కొన్నారు. జాతీయ నేర గణాంకాల బ్యూరో గణాంకాల ప్రకారం మహిళలపై ఏటా నమోదవుతున్న నేరాలు 4.45 లక్షలకు పైగా ఉన్నాయి. అంటే ప్రతి గంటకు సగటున 51 ఎఫ్ఐఆర్‌లు నమోదవుతున్నాయి. దేశవ్యాప్తంగా మహిళలపై నేరాల రేటు లక్ష మంది మహిళలకు 66.4 కేసులు. ఢిల్లీ (144.4), హర్యానా (118.7), తెలంగాణ (117.6) అత్యధిక నేరాల రేటు నమోదైన రాష్ట్రాలుగా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనే దేశంలో నమోదైన మహిళలపై నేరాల్లో సగానికి పైగా కేసులు నమోదవుతున్నాయి. ఈ గణాంకాలు కొన్ని ప్రాంతాల్లో మహిళల భద్రత మరింత ఆందోళనకరంగా ఉందని సూచిస్తున్నాయి.

మహిళలపై నేరాల్లో అత్యధికంగా నమోదవుతున్న విభాగం భర్త లేదా అతని బంధువుల క్రూరత్వం. ఇటీవలి గణాంకాల ప్రకారం ఈ తరహా కేసులు 1.33 లక్షలకు పైగా నమోదై, మహిళలపై మొత్తం నేరాల్లో దాదాపు 30 శాతం వాటాను ఆక్రమించాయి. అంటే మహిళకు అత్యంత పెద్ద ప్రమాదం చాలాసార్లు బయటి వ్యక్తుల నుంచి కాదు; సొంత ఇంటి నుంచే ఎదురవుతోందని ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఆర్థిక ఆధారపడటం, కుటుంబ పరువు, సామాజిక అపఖ్యాతి, భయం కారణంగా అనేక మంది మహిళలు ఫిర్యాదు చేయకపోవడంతో వాస్తవ సంఖ్యలు మరింత ఎక్కువగా ఉండే అవకాశముంది.

గృహహింస చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలంటే మూడు అంశాలపై ప్రత్యేక దృష్టి అవసరం—సంస్థాగత సామర్థ్యం, వేగవంతమైన న్యాయం, బాధితురాలికి సమగ్ర సహాయం. ప్రతి జిల్లాలో పూర్తి స్థాయి రక్షణ అధికారులను నియమించాలి. ఇరవై నాలుగు గంటల సహాయ కేంద్రాలు, ఆశ్రయ గృహాలు, ఉచిత న్యాయ సహాయం, మానసిక పరామర్శ, వైద్య సేవలను ఒకే కేంద్రం ద్వారా అందుబాటులోకి తేవాలి. గృహహింస కేసులకు కాలపరిమితితో విచారణ నిర్వహించాలి. పోలీసు, మహిళా-శిశు సంక్షేమ, వైద్య శాఖలు, స్థానిక పరిపాలన మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలి. గ్రామ, వార్డు స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ సరళమైన ఫిర్యాదు వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

గృహహింస వ్యక్తిగత కుటుంబ సమస్య కాదు; అది మానవ హక్కుల ఉల్లంఘన, సామాజిక న్యాయానికి సవాలు. మహిళలకు చట్టం కల్పించిన హక్కులు కాగితాలకే పరిమితం కాకుండా ఆచరణలో ఫలితాలివ్వాలంటే రాష్ట్ర యంత్రాంగం వేగంగా, సున్నితంగా, బాధితురాలి కేంద్రంగా పనిచేయాలి. గృహహింసను కుటుంబ అంతర్గత విషయంగా కాకుండా ప్రజా న్యాయ సమస్యగా గుర్తించి, చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేసినప్పుడే ప్రతి మహిళకు భయరహిత, గౌరవప్రదమైన జీవితం సాకారమవుతుంది.

-హెచ్.ప్రతాప్



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం - 2- ఆగస్టు 2026








# మసాలాల్లో కల్తీపై భారీ దాడులు

- 25 టన్నుల కల్తీ మసాలా దినుసుల స్వాధీనం
- ముగ్గురు నిందితుల అరెస్టు.. మూడు క్రిమినల్ కేసులు నమోదు
- హానికర రసాయనాలతో కల్తీ చేసినట్లు దర్యాప్తులో వెల్లడి
- హెచ్-ఫాస్ట్, ఆహార భద్రత శాఖ సంయుక్త తనిఖీలు

హైదరాబాద్, ఆగస్టు 4 (తెలంగాణ ముచ్చట్లు):

నగరంలో ఆహార కల్తీని అరికట్టేందుకు హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్‌ఫాస్ట్), జీహెచ్ఎంసీ ఆహార భద్రత శాఖ సంయుక్తంగా చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో భారీగా కల్తీ మసాలా దినుసులు పట్టుబడ్డాయి. ప్రజల నుంచి అందిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా మసాలా దినుసుల వ్యాపార, ప్రాసెసింగ్ కేంద్రాలపై మంగళవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. మొత్తం 13 సంస్థలను తనిఖీ చేయగా, హానికర రసాయనాలతో కల్తీ చేసిన 25,300 కిలోల మసాలా దినుసులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో మసాలా దినుసుల రంగు, మెరుపు, బరువు పెంచి అక్రమ లాభాలు పొందేందుకు పారిశ్రామిక రంగులు, కృత్రిమ ఆహార రంగులు, టాల్కం పౌడి, బియ్యం తవుడు నూనెతో పాటు తినడానికి అనర్హమైన ఇతర పదార్థాలను ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వాము, జీలకర్ర, షాజీరా, లవంగాలు, ఆవాలు, సోంపు వంటి మసాలా దినుసుల్లో ఈ హానికర పదార్థాలు కలిపినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

ఈ వ్యవహారంలో మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు, బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదు చేశారు. మొత్తం మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు హైదరాబాద్ సిటీ పోలీసులు వెల్లడించారు. కేసులపై మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు. దాడుల సందర్భంగా 25,300 కిలోల కల్తీ మసాలా దినుసులతో పాటు 89,150 కిలోల ముడి పదార్థాలు, 12 లీటర్ల బియ్యం తవుడు నూనె, 1.5 కిలోల కృత్రిమ, పారిశ్రామిక రంగులు, మూడు రోలింగ్ యంత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. వీటిని పరిశీలన కోసం సంబంధిత శాఖల ఆధీనంలోకి తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఆహార కల్తీని ఏమాత్రం సహించబోమని పోలీసులు, ఆహార భద్రత శాఖ స్పష్టం చేశాయి. ఆహార పదార్థాల తయారీ, విక్రయాల్లో నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించాయి. అనుమానాస్పద ఆహార ఉత్పత్తులపై సమాచారం అందిస్తే వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నాయి. ఆహార భద్రత పరిరక్షణ కోసం నగరవ్యాప్తంగా ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ప్రజలు నాణ్యమైన ఆహార పదార్థాలనే కొనుగోలు చేయాలని, కల్తీపై అనుమానం ఉన్న వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.






# సీఎంఆర్‌పై దశాబ్ద కాలం ఆడిట్‌కు ఆదేశం

- డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి
- ప్రభుత్వ ధాన్యంలో ప్రతి గింజ ప్రజల ఆస్తేనని ఉత్తమ్ స్పష్టం
- మిల్లులపై విజిలెన్స్ తనిఖీలు, కేసులు కొనసాగింపు
- మిల్లుల వారీగా గడువుతో కూడిన రికవరీ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 4 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవస్థపై తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ఏర్పాటైన తర్వాత అత్యంత విస్తృత స్థాయి సమీక్షను ప్రారంభించింది. గత పదేళ్ల సీఎంఆర్ కార్యకలాపాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, బియ్యం మిల్లింగ్, బకాయిల వసూళ్లు, న్యాయపరమైన చర్యలు, అమలు చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తూ ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు అవసరమైన సంస్కరణలు చేపట్టాలని సూచించారు. మంత్రి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో గత 10 నుంచి 12 సంవత్సరాల ధాన్యం కొనుగోలు, సీఎంఆర్ బకాయిలు, మిల్లుల వారీగా డిఫాల్ట్‌లు, పెండింగ్ వసూళ్లు, విజిలెన్స్ దర్యాప్తులు, న్యాయపరమైన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వానికి రావాల్సిన బియ్యం, నగదు బకాయిలను పూర్తిస్థాయిలో వసూలు చేయడమే ప్రధాన లక్ష్యమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. డిఫాల్ట్ మిల్లర్ల నుంచి బకాయిలను నగదు రూపంలో, ధాన్యం రూపంలో లేదా సన్నబియ్యం రూపంలో తిరిగి పొందేందుకు అన్ని మార్గాలను వినియోగించాలని అధికారులను ఆదేశించారు.

డిఫాల్ట్ మిల్లర్లకు గతంలో ఇచ్చిన అవకాశాల ద్వారా ఇప్పటికే గణనీయమైన మేర వసూళ్లు జరిగినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న ప్రతి కేసుకు మిల్లుల వారీగా గడువుతో కూడిన ప్రత్యేక రికవరీ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. ప్రభుత్వ నిధులను కాపాడటం, ప్రజల ప్రయోజనాలను రక్షించడంలో రాజీ ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. కనీస మద్దతు ధర కింద రైతుల నుంచి కొనుగోలు చేసిన ప్రతి బస్తా ధాన్యం ప్రభుత్వ ఆస్తేనని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగించడం కేవలం మిల్లింగ్ కోసం మాత్రమేనని, ఒప్పందం ప్రకారం నిర్దేశిత పరిమాణం, నాణ్యతతో బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అందజేయాల్సిన బాధ్యత వారిదేనని చెప్పారు. ప్రభుత్వ ధాన్యాన్ని దారి మళ్లించడం లేదా బియ్యం తిరిగి ఇవ్వకపోవడం ప్రజల ఆస్తికి నష్టం కలిగించడమేనని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలోని అత్యధిక మంది మిల్లర్లు నిబంధనలను పాటిస్తున్నప్పటికీ, కొందరు మాత్రమే బియ్యం సరఫరాలో జాప్యం చేయడం, ప్రభుత్వ నిల్వలను దారి మళ్లించడం, ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడినట్లు మంత్రి పేర్కొన్నారు. ఇటువంటి డిఫాల్ట్ మిల్లర్లపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అవసరమైతే బ్లాక్‌లిస్టులో చేర్చడం వంటి పరిపాలనా చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డి.ఎస్. చౌహాన్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తనిఖీలు, దాడులు, నమోదైన కేసులు, వసూళ్ల పురోగతిపై మంత్రికి నివేదిక సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లుల్లో ప్రభుత్వ నిల్వలను భౌతికంగా తనిఖీ చేయడం, కొనుగోలు రికార్డులను అందుబాటులో ఉన్న నిల్వలతో సరిపోల్చడం, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించడం, ప్రభుత్వ ధాన్యం, బియ్యం అక్రమ మళ్లింపులపై దర్యాప్తు కొనసాగించాలని ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. మోసం, అక్రమ మళ్లింపు లేదా నమ్మకద్రోహానికి ఆధారాలు లభించిన ప్రతి కేసులో క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# రామప్ప ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

- రూ.61.99 కోట్ల ప్రసాద్ పథకం పనులపై సమీక్ష
- నాణ్యతతో గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
- మంత్రి సీతక్క, కలెక్టర్ హేమంత్ సంయుక్తంగా తనిఖీ
- భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యమని వెల్లడి

ములుగు, ఆగస్టు 4 (తెలంగాణ ముచ్చట్లు):



వెంకటాపూర్ మండలం పాలంపేటలోని ప్రపంచ వారసత్వ కట్టడం రామప్ప దేవాలయం వద్ద ప్రసాద్ పథకం కింద రూ.61.99 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క), జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో జరుగుతున్న మౌలిక వసతుల అభివృద్ధి పనులు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పర్యాటక అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులు మంత్రికి వివరించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చూడాలని మంత్రి సూచించారు.

రామప్ప దేవాలయం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వారసత్వ కట్టడం కావడంతో అభివృద్ధి పనులు ఆలయ ప్రాచీనతకు ఎలాంటి భంగం కలగకుండా చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. వారసత్వ సంపదను పరిరక్షిస్తూ భక్తులు, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అన్ని పనులు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ ప్రసాద్ పథకం కింద చేపడుతున్న అన్ని పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. నిర్ణయించిన గడువులోపు పనులు పూర్తయ్యేలా సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పనుల నాణ్యతపై రాజీ పడకుండా అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

రామప్ప ఆలయాన్ని సందర్శించే దేశ, విదేశీ పర్యాటకులకు మరింత మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు తెలిపారు. రహదారులు, పర్యాటక సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులను బలోపేతం చేయడం ద్వారా ఆలయాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్‌రెడ్డి, పర్యాటక శాఖ డీఈ నటరాజ్, ఏఈ విజయ్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# రహ్మాత్ పాషాను అభినందించిన కేటీఆర్

- బోండీ ఘటనలో ధైర్యసాహసాలకు ప్రశంసలు
- 20 మంది ప్రాణాలు కాపాడిన హైదరాబాద్ యువకుడికి అభినందనలు
- ఆస్ట్రేలియా శాశ్వత నివాస హోదాపై హర్షం వ్యక్తం
- యువతకు రహ్మత్ పాషా స్ఫూర్తిగా నిలుస్తారని కేటీఆర్ వ్యాఖ్య

హైదరాబాద్, ఆగస్టు 4 (తెలంగాణ ముచ్చట్లు):

ఆస్ట్రేలియాలోని బోండీ ప్రాంతంలో జరిగిన విషాద ఘటనలో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించి పలువురి ప్రాణాలను కాపాడిన హైదరాబాద్‌కు చెందిన భారతీయ మూలాల వ్యక్తి రహ్మత్ పాషాను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. దాదాపు 20 మంది ప్రాణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషించిన రహ్మత్ పాషాకు ఆస్ట్రేలియా ప్రభుత్వం శాశ్వత నివాస హోదా కల్పించడం ప్రతి భారతీయుడికి, ముఖ్యంగా తెలుగు సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు. రహ్మత్ పాషా ప్రదర్శించిన ధైర్యం, మానవత్వం అసాధారణమని కేటీఆర్ కొనియాడారు. బోండీ ఘటన సమయంలో ప్రాణాలకు తెగించి గాయపడిన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం ద్వారా అనేక కుటుంబాల్లో విషాదాన్ని నివారించగలిగారని అన్నారు. సమాజం కోసం నిస్వార్థంగా సేవ చేయాలనే భావనను ఆయన తన కార్యాచరణతో చాటి చెప్పారని ప్రశంసించారు.

బోండీ బీచ్ సమీపంలో ఒక ప్రయాణికుడిని దింపిన అనంతరం పెద్ద శబ్దాలు వినిపించడంతో తొలుత వాటిని బాణాసంచా శబ్దాలుగా భావించిన రహ్మత్ పాషా, పరిస్థితిని గమనించి వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. దుండగుడు దాడి చేస్తున్నట్లు గుర్తించిన ఆయన అక్కడి నుంచి వెళ్లిపోకుండా గాయపడిన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు సహాయక చర్యల్లో చురుకుగా పాల్గొని అనేక మంది ప్రాణాలను రక్షించేందుకు విశేషంగా కృషి చేశారు. రహ్మత్ పాషా చూపిన ధైర్యసాహసాలను గుర్తించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం ఆయనకు శాశ్వత నివాస హోదా మంజూరు చేయడంతో పాటు ప్రతిష్ఠాత్మక బ్రేవరీ అవార్డుకు కూడా నామినేట్ చేసినట్లు సమాచారం. ఆయన సేవలను తాను పనిచేసిన రైడ్ షేరింగ్ సంస్థ కూడా ప్రత్యేకంగా గుర్తించి అభినందించినట్లు వెల్లడైంది.

ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారి ఖ్యాతిని మరింత పెంచేలా రహ్మత్ పాషా చేసిన సేవలు యువతకు ఆదర్శంగా నిలుస్తాయని కేటీఆర్ అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ధైర్యంగా వ్యవహరించి మానవ ప్రాణాలను కాపాడడం ఎంతో గొప్ప విషయమని, సమాజం కోసం సేవ చేయాలనే స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ మహేష్ బిగాల, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, నిశీధర్ బొర్రా, వేణు తదితరులు పాల్గొని రహ్మత్ పాషాను ఘనంగా అభినందించారు. రహ్మత్ పాషా ధైర్యసాహసాలు, సేవాభావం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకోవడం ప్రతి తెలుగు వ్యక్తికి గర్వకారణమని, సమాజం కోసం నిస్వార్థంగా సేవ చేసే వారికి ఆయన స్ఫూర్తిగా నిలుస్తారని నాయకులు పేర్కొన్నారు.

# తుంగతుర్తి కాంగ్రెస్‌పై జగ్గారెడ్డి నివేదిక

- ఏడు పేజీల నివేదికను పీసీసీకి సమర్పణ
- వర్గపోరుపై క్షేత్రస్థాయిలో పది రోజుల పరిశీలన
- ఎమ్మెల్యేనే నియోజకవర్గానికి తొలి నాయకుడని వ్యాఖ్య
- ఉమ్మడి నల్లగొండ నేతల పాత్రపై ప్రస్తావన

హైదరాబాద్, ఆగస్టు 4 (తెలంగాణ ముచ్చట్లు):



సూర్యాపేట జిల్లా తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, వర్గపోరుపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ పరిశీలకుడు జగ్గారెడ్డి తన సమగ్ర నివేదికను సిద్ధం చేసి పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు అందజేశారు. మొత్తం ఏడు పేజీలతో రూపొందించిన ఈ నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పించినట్లు తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై గత పది రోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటించి ఇరువర్గాల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను సేకరించినట్లు జగ్గారెడ్డి వెల్లడించారు. అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం వాస్తవ పరిస్థితులను నివేదికలో పొందుపరిచినట్లు చెప్పారు.

నివేదిక రూపొందించే క్రమంలో వర్గ విభేదాలకు దారితీసిన కారణాలు, పార్టీ శ్రేణుల అభిప్రాయాలు, స్థానిక పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేసినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి అవసరమైన సూచనలు కూడా నివేదికలో పొందుపరిచినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, ఏ నియోజకవర్గంలోనైనా స్థానిక ఎమ్మెల్యేనే తొలి నాయకుడని, ఆ తర్వాతే ఎంపీ, మంత్రులకు ప్రాధాన్యత ఉంటుందని వ్యాఖ్యానించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి పాత్ర ఉంటుందని పేర్కొన్నారు.

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సంబంధించిన వివాదాలు, ఇటీవల జరిగిన పరిణామాలను కూడా నివేదికలో ప్రస్తావించినట్లు తెలిపారు. పార్టీలో సమన్వయం, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక నాయకులుగా ఉన్నారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. పార్టీ నాయకత్వం తగిన నిర్ణయాలు తీసుకుని విభేదాలను పరిష్కరించి సంస్థను మరింత బలోపేతం చేస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# రాజకీయాలపై ఏవీ రంగనాథ్ స్పష్టత

- జనసేనలో చేరతానన్న ప్రచారాన్ని ఖండించిన హైడ్రా కమిషనర్
- పవన్ కల్యాణ్ భూమి వివాదంపై సాంకేతిక వివరణ
- ఉద్యోగం ప్రశాంతంగా చేసుకోనివ్వాలని విజ్ఞప్తి
- హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మరోసారి చర్చకు వచ్చిన రంగనాథ్

హైదరాబాద్, ఆగస్టు 4 (తెలంగాణ ముచ్చట్లు):



తాను రాజకీయాల్లోకి వస్తున్నానంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఖండించారు. ఇటీవల ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తనకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. జనసేన పార్టీలో చేరతానని, ఎన్నికల్లో పోటీ చేస్తానని వస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొంటూ, తన ఉద్యోగాన్ని ప్రశాంతంగా చేసుకోనివ్వాలని కోరారు. మెగాస్టార్ చిరంజీవి కుటుంబంతో గత రెండు దశాబ్దాలుగా పరిచయం ఉందని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కూడా సాన్నిహిత్యం ఉందని రంగనాథ్ చెప్పారు. అయితే వ్యక్తిగత పరిచయాలను రాజకీయాలతో ముడిపెట్టి తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. తాను జనసేనలో చేరతానని, తెలంగాణలో పార్టీ బాధ్యతలు చేపడతానని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు.

గండిపేట సమీపంలోని జన్వాడలో పవన్ కల్యాణ్‌కు చెందిన భూమిపై నెలకొన్న వివాదంపై కూడా రంగనాథ్ వివరణ ఇచ్చారు. 2014లో నలుగురు రైతుల నుంచి సుమారు పది ఎకరాల పట్టా భూమిని కొనుగోలు చేశారని, అనంతరం చెరువుకు సంబంధించిన ప్రాథమిక, తుది నోటిఫికేషన్లు వెలువడ్డాయని తెలిపారు. ఈ భూమి సహజ స్వరూపంలో ఎలాంటి మార్పులు చేయలేదని, చెరువును పూడ్చడం లేదా నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించే నిర్మాణాలు జరగలేదని వివరించారు. అయితే చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమని రంగనాథ్ తెలిపారు. అందుకే ఆ ఫెన్సింగ్ తొలగించాలని సూచించినట్లు చెప్పారు. చెరువుల పరిధిలో ఉన్న పట్టా భూములను కొనుగోలు చేయడం, విక్రయించడం చట్టబద్ధమేనని, అయితే సంబంధిత నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అన్ని కేసుల్లో ఒకే విధమైన ప్రమాణాలతోనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా, హైడ్రా చేపట్టిన కూల్చివేతల వ్యవహారంలో కోర్టు ధిక్కరణ ఆరోపణలకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారనే ఆరోపణల నేపథ్యంలో హైడ్రా కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. హైకోర్టు ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయపరంగా పోరాడేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇదే సమయంలో తనపై వస్తున్న రాజకీయ ప్రచారాన్ని ఖండిస్తూ ఏవీ రంగనాథ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన తనకు లేదని, ప్రజా సేవలో భాగంగా అధికారిగా తన బాధ్యతలను కొనసాగించడమే తన లక్ష్యమని ఆయన మరోసారి స్పష్టం చేశారు.



# ఉద్యోగ కాంగ్రెస్ నియామకాలపై విమర్శలు

- కొత్త లాంగ్‌జంప్ నిబంధన రద్దు చేయాలని డిమాండ్
- పరీక్ష ఫీజుల వసూళ్లపై ప్రభుత్వాన్ని నిలదీసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి
- నిరుద్యోగులతో ప్రభుత్వం వ్యాపారం చేస్తోందని ఆరోపణ
- ఉద్యోగార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 4 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే డి. సుధీర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా లాంగ్‌జంప్‌లో కొత్తగా నాలుగు మీటర్ల నిబంధనను తీసుకురావడం ఉద్యోగార్థులకు అన్యాయమని పేర్కొన్నారు. ఈ నిబంధనను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామకాలలో అభ్యర్థులకు ఇబ్బందులు కలిగించే కొత్త నిబంధనలను అమలు చేయడం వల్ల వేలాది మంది నిరుద్యోగ యువత అవకాశాలు కోల్పోతున్నారని సుధీర్ రెడ్డి అన్నారు. శారీరక అర్హతల విషయంలో గతంలో అమలులో ఉన్న విధానాలనే కొనసాగించాలని, కొత్త నిబంధనల వల్ల అభ్యర్థుల్లో ఆందోళన పెరుగుతోందని పేర్కొన్నారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగాల పరీక్షలకు ఎలాంటి ఫీజులు వసూలు చేయబోమని హామీ ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం ఎస్సై పోస్టుకు రూ.1,500, కానిస్టేబుల్ పోస్టుకు రూ.1,000 చొప్పున పరీక్ష ఫీజులు వసూలు చేస్తూ ఎన్నికల హామీలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పరీక్ష ఫీజుల పేరుతో నిరుద్యోగ యువతపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ఉద్యోగాల కోసం ఇప్పటికే తీవ్ర పోటీ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అభ్యర్థుల నుంచి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేయడం సరైంది కాదన్నారు. ఈ విధానం ద్వారా ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులతో వ్యాపారం చేస్తోందని ఆరోపించారు.

నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, పరీక్ష ఫీజులను రద్దు చేయడంతో పాటు లాంగ్‌జంప్‌కు సంబంధించిన నాలుగు మీటర్ల నిబంధనను ఉపసంహరించుకోవాలని సుధీర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామకాల ప్రక్రియను పారదర్శకంగా, అభ్యర్థులకు అనుకూలంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నిరుద్యోగ యువత సమస్యలను గుర్తించి వారి ఆందోళనలను పరిష్కరించే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ కోరింది. ఉద్యోగ నియామకాలలో న్యాయం జరిగేలా విధానాలను సవరించి యువతకు భరోసా కల్పించాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఈ20 పెట్రోల్‌కు పంజాబ్ బ్రేక్

- ఈ20 పెట్రోల్‌పై అసెంబ్లీ తీర్మానం
- సాధారణ పెట్రోల్ కూడా ఇవ్వాలన్న డిమాండ్
- నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలన్న సూచన
- భగవంత్ మాన్ ఆరోపణలు

చండీగఢ్, ఆగస్టు 4 (తెలంగాణ ముచ్చట్లు):

దేశవ్యాప్తంగా అమలవుతున్న ఈ20 పెట్రోల్ విధానంపై పంజాబ్ అసెంబ్లీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 20 శాతం ఇథనాల్ మిశ్రమంతో కూడిన ఈ20 పెట్రోల్ వినియోగాన్ని దేశవ్యాప్తంగా నిలిపివేయాలని కోరుతూ మంగళవారం అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించింది. వినియోగదారులకు ఈ20 పెట్రోల్‌ను బలవంతంగా వినియోగించే పరిస్థితి లేకుండా, ఇథనాల్ లేని సాధారణ పెట్రోల్‌ను కూడా అందుబాటులో ఉంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ20 పెట్రోల్‌పై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సమయంలో పంజాబ్ అసెంబ్లీ తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, ఈ20 పెట్రోల్‌కు అనుకూలంగా రూపొందించని పాత వాహనాల్లో ఇథనాల్ మిశ్రమ ఇంధనం వినియోగించడం వల్ల ఇంజిన్ పనితీరుపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. మైలేజీ తగ్గడం, ఇంధన వ్యవస్థలో సాంకేతిక లోపాలు తలెత్తడం, నిర్వహణ వ్యయం పెరగడం వంటి సమస్యలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలకు ప్రత్యామ్నాయంగా సాధారణ పెట్రోల్‌ను కూడా విక్రయించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ20 పెట్రోల్ వల్ల మైలేజీ తగ్గుతుంటే దానికి అనుగుణంగా ఇంధన ధరను తగ్గించాలని కూడా తీర్మానంలో పేర్కొన్నారు. అంతేకాకుండా ఆటోమొబైల్ ఇంజినీర్లు, పెట్రోలియం రంగ నిపుణులు, పర్యావరణ శాస్త్రవేత్తలు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో కూడిన స్వతంత్ర నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి ఈ20 పెట్రోల్ ప్రభావంపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆ అధ్యయనం నివేదిక ఆధారంగానే తదుపరి విధాన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సభలో ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మాట్లాడుతూ, సుమారు 45 వేల వాహనాలపై నిర్వహించిన అధ్యయనంలో ఈ20 పెట్రోల్ వినియోగం కారణంగా మైలేజీ తగ్గినట్లు, కొన్ని వాహనాల్లో సాంకేతిక సమస్యలు కూడా తలెత్తినట్లు గుర్తించారని తెలిపారు. వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని మరోసారి సమీక్షించాలని కోరారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఒకే విధమైన ఇంధన విధానాన్ని అమలు చేయడం సరికాదని అన్నారు.

ఇటీవల అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం నేపథ్యంలోనే ఈ20 పెట్రోల్ వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం వేగంగా అమలు చేస్తోందని భగవంత్ మాన్ ఆరోపించారు. ఆ ఒప్పందంలో భాగంగా భారత్ భారీ మొత్తంలో ఇథనాల్ కొనుగోలు చేయాల్సి ఉంటుందని, అందుకే దేశంలో ఇథనాల్ మిశ్రమ ఇంధనాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఆరోపణలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. అయితే ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. మరోవైపు పర్యావరణ పరిరక్షణ, ముడి చమురు దిగుమతుల తగ్గింపు, ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ20 పెట్రోల్ విధానాన్ని అమలు చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో పంజాబ్ అసెంబ్లీ ఆమోదించిన తీర్మానం దేశవ్యాప్తంగా ఇథనాల్ మిశ్రమ ఇంధన విధానంపై కొత్త చర్చకు దారితీసే అవకాశముందని రాజకీయ, పారిశ్రామిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.






Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,
Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in